Digital, tmedia.net.in

# టీ-మీడియా

tmedia.net.in

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

శనివారం 03/10/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ


## మహాత్ముడికి గవర్నర్, సీఎం నివాళులు



**టి మీడియా , అక్టోబర్ 2 , హైదరాబాద్ బ్యూరో :** గాంధీ మహాత్ముడి జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్ వద్ద ఆయన సమాధికి గవర్నర్? శివప్రతాప్? శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి నివాళులు అర్పించారు. గాంధీ చేసిన సేవలను స్మరించుకున్నారు. వారితో పాటు పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు కూడా బాపూజీకి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీఎం అహింసనే ఆయుధంగా మలచి స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించిన మహాత్మా గాంధీ మానవాళికి సత్యం, శాంతి, మానవత్వం నేర్పిన మహనీయుడని కొనియాడారు.ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన గాంధీజీ చిత్ర ప్రదర్శనను గవర్నర్, సీఎం రేవంత్ రెడ్డి తిలకించారు. అనంతరం డిజిటల్ మ్యూజియాన్ని గవర్నర్‌తో కలిసి ప్రారంభించారు. ఆ తర్వాత సర్వమత ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్? గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# సహకార బ్యాంకుల్లో రూ.6 వేల కోట్ల అక్రమాలు!




**⏭| బినామీల పేర్లతో పెద్దఎత్తున రుణాల స్వాహా**

**టి మీడియా , అక్టోబర్ 2 , అమరావతి బ్యూరో :** రాష్ట్రంలో కొన్ని వ్యవసాయ సహకార పరపతి సంఘాల్ని నేతలు, అధికారులు కలిసి పీల్చి పిప్పి చేశారు. బంధువులు, బినామీ పేర్లతో రుణాలు తీసుకుని, తిరిగి కట్టకుండా అధికారాన్ని అడ్డు పెట్టుకుని తప్పించుకుంటున్నారు. దీంతో పీఏసీఎస్‌లలో నగదు డిపాజిట్ చేసిన రైతులకు గడువు తీరినా సొమ్ము చెల్లించలేని దుస్థితి తలెత్తింది. రికవరీ లేదంటూ పీఏసీఎస్ అధికారులు నగదు తిరిగి ఇవ్వడం లేదు. వైద్య ఖర్చులు, పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం డిపాజిట్‌దారులు బయట అప్పులు చేయాల్సి వస్తోంది. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో పలుచోట్ల ఈ పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అక్రమార్కులపై చర్యలు లేవు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.6 వేల కోట్ల మేర అక్రమాలు జరిగినట్లు అంచనా. ఆ సొమ్మంతా ఎవరి దగ్గరకు చేరిందనే లెక్కలు తేల్చడం లేదు. విచారణలతోనే కాలం గడచిపోతోంది. రాజకీయ అండదండలతో అక్రమార్కులు తమపై కేసులు లేకుండా జాగ్రత్త పడుతున్నారు.

ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ సమయంలో భూములు కోల్పోయిన, అమ్ముకున్న రైతులు ఏలూరు జిల్లా టి.నర్సాపురం పీఏసీఎస్‌లో నగదు డిపాజిట్ చేశారు. వాటిపై వచ్చే వడ్డీతో జీవనం సాగించవచ్చని భావించారు. వారికి ఇప్పుడు ఒక్క రూపాయి వెనక్కి ఇవ్వడం లేదు. గడువు తీరిన డిపాజిట్లు పునరుద్ధరించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు.

తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం పీఏసీఎస్ పరిధిలోనూ డిపాజిట్లు తిరిగి ఇవ్వడం లేదు. సుమారు 180 మందికి రూ.3.13 కోట్ల మేర చెల్లించాలి. రైతులు ఆందోళన చేయడంతో రూ.లక్ష లోపు డిపాజిట్ చేసిన వారికి రూ.40 వేలు, రూ.2 లక్షల లోపు రూ.75 వేలు, రూ.2 లక్షలు దాటితే రూ.లక్ష వరకు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. ఆ ప్రక్రియ కూడా ముందుకు సాగడం లేదు.

**పప్పుబెల్లాల్లా పంచుకున్నారు**

వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో కొందరు నేతలు సహకార పరపతి సంఘాలను తమ ఇంటి బీరువాల్లా ఉపయోగించుకున్నారు. కుటుంబ సభ్యులు, బినామీల పేర్లతో రూ.లక్షల్లో రుణాలు తీసుకున్నారు. కొవిడ్ సమయంలో అదనపు రుణాల మంజూరుకు వచ్చిన నిధుల్ని కూడా పప్పుబెల్లాల్లా పంచుకున్నారు. అక్కడి అధికారులూ వారికి సహకరించారు. వారు కూడా తమ బంధువుల పేర్లతో రుణాలు తీసుకున్నారు. అక్రమాలకు పాల్పడ్డ అధికారులు, నేతలకే సహకార శాఖలోని కొందరు అధికారులు సహకరిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 30% పైగా సహకార సంఘాల్లో రుణాలు అక్రమంగా పొందారని, బకాయిలు చెల్లించడం లేదని నివేదికలు ఉన్నాయి.

చర్యలకు ఆదేశించినా స్పందన శూన్యం టి.నరసాపురం పీఏసీఎస్‌ని పరిశీలిస్తే ఎలాంటి హామీ లేకుండా పెద్దమొత్తంలో రుణాలు మంజూరు (మిగతా 2లో)

## ఘోర రోడ్డుప్రమాదం



**⏭| ఏడుగురు మృతి**

**టి మీడియా , అక్టోబర్ 2 , ఢిల్లీ బ్యూరో :** మహారాష్ట్రలోని అమరావతి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ధమన్‌గావ్ సమీపంలోని సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వేపై ఓ వ్యాన్‌ను వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఏడుగురు యువకులు మరణించారు. మరో 18 మందికి తీవ్రగాయాలయ్యాయి. దసరాకు అమ్మవారి విగ్రహం తెచ్చేందుకు వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. గతరాత్రి వేగంగా దూసుకెళ్తున్న లారీ అదుపుతప్పి వ్యాన్‌ను బలంగా ఢీకొట్టినట్లు పోలీసులు వెల్లడించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. అతివేగమే దుర్ఘటనకు కారణమని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

## మందులపై ఇష్టారీతిన ఎమ్మార్పీ రేట్లు

**⏭| కొనలేక రోగులకు తప్పని ఇక్కట్లు**

**టి మీడియా , అక్టోబర్ 2 , హైదరాబాద్ బ్యూరో :** మెడికల్? షాప్? నిర్వాహకులు గరిష్ఠ చిల్లర ధర(ఎమ్మార్పీ)ను అడ్డం పెట్టుకొని మందులను ఇష్టం వచ్చిన ధరలకు అమ్ముతున్నారు. రోగుల అవసరాన్ని ఆసరాగా తీసుకొని పావలా పైసల కన్నా తక్కువకు దొరికే మందులను కూడా రూపాయిగా ధర ముద్రించి రోగులకు కట్టబెడుతూ వారి క్యాష్? కౌంటర్లు నింపుకుంటున్నారు. ఇటీవల ఈ తరహా ఉదంతాలు రాష్ట్రవ్యాప్తంగా వెలుగుచూస్తున్నాయి. ఎమ్మార్పీపై నియంత్రణ లేకపోవడంతో విచ్చలవిడిగా విక్రయిస్తూ పేదవాళ్ల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.



**ఇటీవల వెలుగుచూసిన పలు ఘటనలివి**

వనపర్తి జిల్లాలోని పెబ్బేరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన వృద్ధుడికి క్యాన్సర్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం అతన్ని హైదరాబాద్ తీసుకెళ్లారు. రోజువారీ మందుల కోసం నెలకు రూ.27 వేలు ఖర్చు అవుతున్నాయి. ఈ క్రమంలో ఓ మెడికల్ ఏజెన్సీని సంప్రదించగా అవే మందులు రూ.7 వేలకే లభించాయి. అయితే వారికి తెలిసిన ఓ మెడికల్ రిటైలర్ అవే మందులను కేవలం రూ.5 వేలకు కూడా అందించడం గమనార్హం.

వనపర్తి పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ప్రైవేట్ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోగా డాక్టర్ 15 రోజులపాటు మందులు వినియోగించాలని సూచించారు. అదే హాస్పిటల్? ఫార్మసీలో వైద్యుడు సూచించిన మాత్రలకు రూ.5 వేలు అవుతుందని చెప్పారు. కానీ వేరే కంపెనీ తయారు చేసిన అవే మందులు ఓ జెనరిక్ మందుల దుకాణంలో రూ.500కే లభించాయి.

**ఎక్కువ ధరలు ముద్రించి గోల్‌మాల్**

మందుల అమ్మకాలలో అధిక లాభాల కారణంగా ప్రైవేట్ హాస్పిటళ్లు, నర్సింగ్ హోమ్‌లు, పాలిక్లినిక్‌లు చాలా వరకు సొంత ఫార్మసీలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. పలు ఫార్మా కంపెనీలు మందుల ఎమ్మార్పీలను అధికంగా ముద్రించి వాటిని ఏజెన్సీలకు రాయితీపై సరఫరా చేస్తున్నాయి. ఆ తర్వాత ఈ ఏజెన్సీలు అవే మందులను (మిగతా 2లో)

# 21 జిల్లాల్లో 388 కరవు మండలాలు



**⏭| ప్రకటించిన ప్రభుత్వం**

**⏭| ఉపశమన చర్యలకు ఆదేశం**

**టి మీడియా , అక్టోబర్ 2 , అమరావతి బ్యూరో :** ఖరీఫ్ సీజన్‌పై తీవ్ర ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు కరవు మండలాలను ప్రకటించింది. తీవ్ర ప్రభావం మధ్యస్థ ప్రభావం కేటగిరీలుగా విభజించింది. ఖరీఫ్ పంటకాలానికి సంబంధించి ప్రభుత్వం ముందస్తుగా 21 జిల్లాల్లో 388 కరవు మండలాల్ని ప్రకటించింది. వాటిలో 283 మండలాల్లో తీవ్రంగా, 105 మండలాల్లో మధ్యస్థంగా కరవు పరిస్థితులు ఉన్నట్లు పేర్కొంటూ సీఎస్, రెవెన్యూ (విపత్తుల నిర్వహణ) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా ప్రాంతాల్లో రైతులకు రుణాల రీషెడ్యూల్‌తో పాటు కరవు నుంచి ఉపశమన చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు.

**53.43% లోటు వర్షపాతం**

వర్షపాత గణాంకాలను పరిగణనలోకి తీసుకుని ముందస్తు కరవు మండలాల్ని ప్రకటించారు. మూడు నెలల్లో 424.3 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉంటే 197.6 మి.మీ. మాత్రమే నమోదైంది. వర్షపాత లోటు, పొడి వాతావరణంతో పాటు సాగు విస్తీర్ణం, రిమోట్ సెన్సింగ్ ఇండెక్స్, తేమ, జలాశయాల్లో నీటినిల్వలు, భూగర్భజలం, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా కరవు మండలాల్ని ఎంపిక చేశారు. వ్యవసాయ, ఉద్యాన, జలవనరులు, భూగర్భజలవనరులశాఖ, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏపీ శాక్ సంస్థల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా జాబితా వెల్లడించింది.

అన్నమయ్య, చిత్తూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని మొత్తం మండలాల్ని కరవు ప్రాంతాలుగా గుర్తించారు. మార్కాపురం జిల్లాలోని 2, నంద్యాల జిల్లాలో 2, వైఎస్సార్ కడప జిల్లాలో 3, శ్రీసత్యసాయి జిల్లాలో 3, అనంతపురం జిల్లాలో 4 మినహా మిగిలిన అన్ని మండలాలూ (మిగతా 2లో)

# తెలంగాణ గిరిజన సంఘం మండల నూతన కమిటీ ఎన్నిక

- గౌరవాధ్యక్షుడిగా భూక్యా రంజిత్ నాయక్
- అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులుగా బానోతు బన్సీలాల్, అజ్మీర శోభన్ నాయక్



**టీ మీడియా,అక్టోబర్02,సింగరేణి(కారేపల్లి):** గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం (టీజీఎస్) కారేపల్లి మండల మహాసభ పిలుపునిచ్చింది. కారేపల్లిలోని భాగం రామనర్సయ్య భవన్‌లో అజ్మీర శోభన్ నాయక్ అధ్యక్షతన మండల మహాసభ నిర్వహించారు.ఈ సందర్భంగా 15 మందితో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలంగాణ గిరిజన సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం ప్రకటించారు.నూతన కమిటీ గౌరవాధ్యక్షుడిగా గాదేపాడు సర్పంచ్,సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు భూక్యా రంజిత్ నాయక్,అధ్యక్షుడిగా ఉసిరికాయలపల్లి మాజీ సర్పంచ్ బానోతు బన్సీలాల్ నాయక్,ప్రధాన కార్యదర్శిగా అజ్మీర శోభన్ నాయక్ ఎన్నికయ్యారు.సలహాదారులుగా లాల్ రామచంద్ర నాయక్,భూక్యా తోప్య నాయక్,ఉపాధ్యక్షులుగా భూక్యా రాంబాబు,ధరావత్ వినోద్ కుమార్,వాంకుడోత్ దళ్‌సింగ్ నాయక్,సహాయ కార్యదర్శులుగా కేలోత్ రవి నాయక్,మాలోత్ బాలు నాయక్,భూక్యా రమేష్,ధరావత్ రవికుమార్,కమిటీ సభ్యులుగా బానోత్ శ్రీను,బాలు తదితరులు ఎన్నికైనట్లు తెలిపారు.తండాలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలి

గిరిజన తండా గ్రామపంచాయతీలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించడంతో పాటు వాటికి సొంత గ్రామపంచాయతీ భవనాలు నిర్మించాలని మహాసభ తీర్మానించింది.కారేపల్లి మండల కేంద్రంలో 50 పడకల ఆసుపత్రిని నిర్మించాలని,మాణిక్యారం లేదా చీమలపాడు ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరింది.పోడు రైతులకు ఐటీడీఏ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించి,వ్యవసాయ బోర్లు మంజూరు చేయాలని తీర్మానించారు.నిరుద్యోగ గిరిజన యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించాలని,కారేపల్లి మండల కేంద్రంలో సేవాలాల్ విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఇందుకోసం ప్రభుత్వం ఒక ఎకరం భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు.ఖమ్మంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి.గిరిజన సంక్షేమ శాఖ పథకాలు గిరిజనులకు మరింత సమర్థంగా అందేందుకు ఖమ్మంలో ప్రత్యేకంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలని మహాసభ తీర్మానించింది. కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న గిరిజన ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని,ఆశ్రమ పాఠశాలలు,గిరిజన తండాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరింది.గిరిజనుల విద్య, వైద్యం,ఉపాధి, సాగు,మౌలిక వసతులకు సంబంధించిన పలు సమస్యలపై మహాసభలో విస్తృతంగా చర్చించి తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు భూక్యా వీరభద్రం తెలిపారు.మహాసభ ఆమోదించిన తీర్మానాలను ప్రభుత్వం వెంటనే అమలు చేసి గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఆళ్ళపల్లిలో ఘనంగా 'వికసిత్ భారత్' గ్రామ సభ



**టీ మీడియా,అక్టోబర్ 2, ఆళ్లపల్లి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ వాసం సుస్మిత ఆధ్వర్యంలో "వికసిత్ భారత్ గ్రామీణ రోజ్గార్ ఢ అజీవికా మిషన్ గ్రామ సభ ఘనంగా నిర్వహించబడింది. "మన ఊరు – మన ప్రణాళిక – మన భవిష్యత్తు" అనే నినాదంతో గ్రామాభివృద్ధి కోసం బలమైన ప్రణాళికలు రూపకల్పన చేయడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ వాసం సుస్మిత మాట్లాడుతూ... గ్రామంలో సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని, గ్రామ పరిధిలో మౌలిక వసతుల కల్పన మరియు ఉపాధి అవకాశాల పెంపునకు కంకణం కట్టుకున్నట్లు తెలిపారు. గ్రామంలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులను విజయవంతంగా చేపట్టినందుకు గ్రామ ప్రజలు సర్పంచ్ సుస్మిత పాలనను మరియు కృషిని ప్రశంసించి, కొనియాడారు. సమగ్ర గ్రామాభివృద్ధి కోసం పంచాయతీ పరిధిలోని ప్రజలందరూ గ్రామ సభలలో చురుగ్గా భాగస్వామ్యమై గ్రామాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సిఎంఆర్ఎఫ్ కల్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ



**టీ మీడియా, అక్టోబర్ 2 ,పెబ్బేరు:** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణ మండల పేద ప్రజల సంక్షేమానికి వారి కష్ట సుఖాల్లో తోడుగా నిలిచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి తెలిపారు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెబ్బేరు పట్టణం మండలానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులతో పాటు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ నిరుపేదల ఆరోగ్య అత్యవసర పరిస్థితిల్లో సీఎంఆర్ఎఫ్ నిధులు కొండంత అండగా నిలుస్తున్నాయని అలాగే ఆడపిల్లల పెళ్లిళ్లకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు ఆర్థిక భరోసా ఇస్తున్నాయని పేర్కొన్నారు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పెబ్బేరు పట్టణానికి చెందిన 59 మందికి మండలానికి చెందిన 24 మందికి (మొత్తం 83 చెక్కులు) రూ 1 39 35 000 (కోటి 39 లక్షల 35 వేల రూపాయలు) విలువైన ఆర్థిక సాయం అందజేశారు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ మొత్తం 47 మంది లబ్ధిదారులకు రూ 47 04 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి కౌన్సిలర్ జములమ్మ నాయకులు విజయవర్ధన్ రెడ్డి వెంకటేష్ సాగర్ సురేందర్ గౌడ్ మండల పట్టణ కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గాంధీ జయంతి వేడుకలు



**టీ మీడియా, అక్టోబర్ 2 ,ఆళ్లపల్లి :** జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆళ్లపల్లి మండల కేంద్రంలో గాంధీ జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.?ఈ కార్యక్రమంలో ఆళ్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాసం శ్రీకాంత్, ఆళ్లపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ వాసం సుస్మిత ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో మహాత్మా గాంధీ వహించిన పాత్ర అతులితమైనదని, ఆయన చూపిన అహింసా మార్గం, సత్యగ్రహ సూత్రాలు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. గాంధీజీ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.?ఈ వేడుకల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షులు వాసం శ్రీకాంత్, ఆత్మ కమిటీ బుర్ణ రవి, మర్కోడు గ్రామ అధ్యక్షుడు కోనేటి వీరభద్ర చారి ప్రముఖ వ్యాపారవేత్తలు నేరెళ్ల వెంకన్న డాక్టర్ శీను యూత్ కాంగ్రెస్ నాయకులు భరత్ సాయి రవి ప్రశాంత్ రామయ్య సతీష్ సంతోష్ బోయిల శివ సాయి సంపత్ మహిళా నాయకురాలు పానుగంటి మంగ ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సహకార బ్యాంకుల్లో రూ.6 వేల కోట్ల అక్రమాలు!

(మొదటి పేజీ తరువాయి)
చేయించుకున్నారు. 2023లో సహకార శాఖ విచారణ చేయగా రూ.43 కోట్ల దుర్వినియోగం జరిగిందని తేలింది. చర్యలకు ఆదేశించి మూడేళ్లయినా స్పందన శూన్యం. 2025 మార్చి 31కి రూ.16.22 కోట్ల డిపాజిట్లు చెల్లించాల్సి ఉంది. ఏలూరు డీసీసీబీకి రూ.86.17 కోట్ల బకాయిలున్నాయి. రైతుల నుంచి వసూలు చేయాల్సిన బకాయిలు రూ.57.33 కోట్లుగా గుర్తించారు. ఉండ్రాజవరం సహకార సంఘంలో సుమారు రూ.4.34 కోట్ల మేర అవకతవకలు బయటపడ్డాయి. సహకార శాఖలోని నేతలు, ఉద్యోగులు, బ్యాంకు అధికారులు కూడా బంధువుల పేర్లతో రుణాలు తీసుకున్నారు.

# మందులపై ఇష్టారీతిన ఎమ్మార్పీ రేట్లు

(మొదటి పేజీ తరువాయి)
ప్రైవేట్ ఆసుపత్రులకు తక్కువ ధరలకు అందిస్తాయి. అయితే ప్రైవేట్ ఆసుపత్రులు తమ సొంత మెడికల్? షాపుల్లో కొన్ని నిర్దిష్ట బ్రాండ్ల మందులను నిల్వ చేస్తాయి. ఈ బ్రాండ్లు బయట అంత తేలికగా లభించవు. దీంతో రోగులు మరో గత్యంతరం లేక అక్కడే ఔషధాలు కొనుగోలు చేయాల్సి వస్తోంది.

**రాయితీల పేరిట కట్టబెడుతూ**

ప్రైవేట్ హాస్పిటళ్లలోని డాక్టర్లు రాసిన మందుల గురించి తెలుసుకొని పలు ఫార్మసీల నిర్వాహకులు అవే మందులకు ప్రత్యామ్నాయ బ్రాండ్లను నిల్వ చేస్తున్నారు. వాటిని 10 నుంచి 15 శాతం వరకు రాయితీలను అందిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రికి సంబంధించిన మెడికల్? దుకాణంలో డిస్కౌంట్లు ఇవ్వకపోవడం, కంపెనీ వేరైనప్పటికీ మెడిసిన్? ఒకటేనని భావించి కొందరు బయటి దుకాణాల నుంచి కొనడానికి మొగ్గు చూపుతున్నారు. ఎమ్మార్పీ మీద ఎలాంటి నియంత్రణలూ లేకపోవడంతో మెడికల్ షాపుల యజమానులు జోరుగా వ్యాపారం చేస్తున్నారు.

# 21 జిల్లాల్లో 388 కరవు మండలాలు

(మొదటి పేజీ తరువాయి)
ఈ జాబితాలో ఉన్నాయి.

**జిల్లాల వారీగా కరవు మండలాల సంఖ్య**

జిల్లా తీవ్ర కరవు మధ్యస్థం
శ్రీకాకుళం1 4,విజయనగరం 10
12,విశాఖపట్నం 1 3,అనకాపల్లి
22 0,కాకినాడ 0 6,
తూర్పుగోదావరి 0 4 ,ఏలూరు
1 7, కృష్ణా 8 9, ఎన్టీఆర్
3 10, గుంటూరు 8 3 ,
బాపట్ల18 10, ప్రకాశం 18
10,మార్కాపురం 19 0,కర్నూలు
15 0,
నంద్యాల 26 2,
అనంతపురం 27 1 , శ్రీ
సత్యసాయి 28 1, వైఎస్సార్
కడప 14 23,అన్నమయ్య 25
0,
చిత్తూరు 24 0.

పరిగణనలోకి తీసుకున్న అంశాలు

జూన్ నుంచి ఆగస్టు నెలాఖరు వరకు వర్షపాతం వివరాలు,

వర్షపాతంలో వ్యత్యాసం, జలాశయాల్లో నీటి లభ్యత, భూగర్భ నీటిమట్టం, క్షేత్రస్థాయి పరిశీలన,

ఎన్నో ప్రతికూలతలు ,జూన్ నుంచి ఆగస్టు వరకు లోటువర్షపాతం,గరిష్ఠస్థాయిలో ఉష్ణోగ్రతల నమోదు,

వర్షాల మధ్య సుదీర్ఘ విరామం,జలాశయాలకు వరద నీటి ప్రవాహాల్లేకపోవడం,కాలువలకు నీటి విడుదల లేకపోవడం,సాగు తగ్గి రైతులు, కూలీలకు పనుల్లేకపోవడం,పాడి పశువులకు గడ్డి కొరత,

విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల విక్రయాలు దెబ్బతినడం.పాల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం

ఇప్పటికే పంట ఉన్న పొలాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించాల్సి రావడం. ఇందుకు అదనపు పెట్టుబడికరవు మండలాల్లో పంట రుణాల పునర్‌వ్యవస్థీకరణ, కొత్త రుణాల మంజూరు, పెట్టుబడి రాయితీ, తాగునీటి సరఫరా, పశువుల మేత, ఉపాధి హామీ పథకం విస్తరణ తదితర అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించి ఆదుకుంటుంది.

రెండో విడతలో అవకాశం?

రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ముందస్తు ఖరీఫ్‌నకు సంబంధించి కరవు మండలాలను ప్రకటించిందని.. రెండో విడతలో ఖరీఫ్–2026 కరవు మండలాలను ప్రకటించే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. రెండో విడతలో కర్నూలు జిల్లాలోని 12 మండలాలను కరవు మండలాలుగా ప్రకటించే అవకాశం ఉందంటున్నారు. కర్నూలు జిల్లాలో 12 మండలాలను కరవు మండలాలుగా ప్రకటించాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

# లాల్ బహదూర్ శాస్త్రి జయంతి

**టీ మీడియా, అక్టోబర్ 02 పెబ్బేరు:** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో అజాద్ యూత్ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధానమంత్రి జై జవాన్ జై కిసాన్ అనే నినాదాన్ని లేవనెత్తిన స్ఫూర్తిప్రదాత లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి దేశానికి ఆయన చేసిన కృషి సేవలను కొనియాడారు యువత చదువులపై ద్రుష్టి పెడుతూ ఆయన బాటలో నడిచి దేశానికి సేవ చేయాలని యువత ఈ దేశానికి దిశా నిర్దేశం కావాలని అజాద్ యూత్ సభ్యులు అన్నారు .ఈ కార్యక్రమంలో సంబు జయప్రకాశ్ గొనెల సహదేవుడు సత్యనారాయణ వెంకటేశ్వర్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి రంగారెడ్డి మహేందర్ టీచర్ మోహన్ విజయవర్ధన్ గౌడ్ నాగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మాగాంధీ జయంతి వేడుకలు



**టీ మీడియా ,అక్టోబర్ 2 ,కూసుమంచి:** గాంధీజీ చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, శుక్రవారం కూసుమంచి లో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం, మినీ గాంధీ భవన్ లో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులర్పించారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, స్వచ్ఛత, గ్రామ స్వరాజ్యం, ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి హాఫీజుద్దీన్, జిల్లా నాయకులు జొన్నలగడ్డ రవి కుమార్, కూసుమంచి మండల ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు జూకూరి గోపాలరావు, నాయకులు బొల్లంపల్లి సుధాకర్ రెడ్డి, చాట్ల పరుశురాం, బెల్లంకొండ సాయి కిరణ్, గుండా భూపాల్ రెడ్డి, బుస్సా మాధవ రెడ్డి, హాలావత్తు సైదా, బుచ్చిరెడ్డి, నరసింహారావు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చార్జీలు పెంపు.. కొత్త రేట్లు ఇవే

**టి మీడియా , అక్టోబర్ 2 , హైదరాబాద్:**

తెలంగాణ ప్రభుత్వం ఆటో ప్రయాణికులకు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 12 ఏళ్ల తర్వాత ఆటో రిక్షా చార్జీలను సవరించింది. జీవో 46 ప్రకారం తొలి 1.6 కిలోమీటర్లకు కనీస చార్జీ రూ.30గా నిర్ణయించగా, ఆ తర్వాత ప్రతి కిలోమీటర్‌కు రూ.14 చొప్పున వసూలు చేయనున్నారు. దీంతో తెలంగాణ ఆటో ఫేర్, హైదరాబాద్ ఆటో చార్జీల్లో మార్పులు అమల్లోకి వచ్చాయి .డిటెన్షన్ లేదా వెయిటింగ్ చార్జీని నిమిషానికి 75 పైసలుగా, లగేజీ చార్జీని 50 పైసలుగా నిర్ణయించారు. గరిష్ఠంగా 100 కిలోల లగేజీ పరిమితి కొనసాగుతుంది. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు సాధారణ చార్జీకి 1.5 రెట్లు వసూలు చేయనున్నారు. కొత్త రేట్లకు అనుగుణంగా డిజిటల్ ఆటో మీటర్లను రీసెట్ చేసేందుకు మూడు నెలల గడువు ఇచ్చారు.కొత్త ఆటో చార్జీల ప్రకారం ప్రయాణికులు మీటర్ రేట్లను పరిశీలించి చెల్లించాలని, డ్రైవర్లు నిర్ణయించిన టారిఫ్‌ను మీటర్లలో అమలు చేయాలని ప్రభుత్వం సూచించింది. పెరిగిన ఇంధన, నిర్వహణ వ్యయాలు, ఆటో డ్రైవర్ల నుంచి వచ్చిన విజ్ఞప్తుల నేపథ్యంలో ఈ ఫేర్ సవరణ




చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు.

# గ్రామసభలకు హాజరైన జనసేన నాయకులు



**టీ మీడియా,అక్టోబర్2,చింతూరు :**

మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని చింతూరు మండలంలో జనసేన పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో చింతూరు, చట్టి, పెద్ద సీతనపల్లి లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ చూపిన సత్యం, అహింస, గ్రామ స్వరాజ్యం, ప్రజాసేవ మార్గాలను నాయకులు, కార్యకర్తలు గుర్తు చేసుకున్నారు. అలాగే వివిధ గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో జనసేన నాయకులు పాల్గొని, గ్రామ ప్రజల సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు, గ్రామ అభివృద్ధికి సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు. గ్రామసభ ద్వారా ప్రజలకు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో జనసేన నాయకులు తీగల రవి, బేడే సతీష్, మల్లిపూడి సతీష్ పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, గ్రామసభల ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధించాలంటే ప్రజలు గ్రామసభల్లో చురుకుగా పాల్గొని తమ సమస్యలను, అభివృద్ధి అవసరాలను తెలియజేయాలని జనసేన నాయకులు సూచించారు. గాంధీజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలతో కలిసి, ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తామని జనసేన నాయకులు తెలిపారు.

# గాంధీ ఆశయాలు సమాజ అభివృద్ధికి తోడ్పాటు



**టీ మీడియా, అక్టోబర్ 2 ,ఆత్మకూరు:**

జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతిని పురస్కరించుకుని ఆత్మకూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో మహాత్మా గాంధీజీ చిత్రపటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ జీ. నాగమణి, వైస్ చైర్‌పర్సన్ ఎం. శ్రీనివాసులు, అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి జీ. నాగమణి మాట్లాడుతూ, మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి మరియు స్వచ్ఛత మార్గాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారా సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు.వైస్ చైర్‌పర్సన్ ఎం. శ్రీనివాసులు మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీజీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. గాంధీజీ సిద్ధాంతాలను నేటి తరానికి తెలియజేస్తూ, వాటిని జీవితంలో ఆచరించాలని సూచించారు.మున్సిపల్ మేనేజర్ సీత్యా నాయక్ మాట్లాడుతూ, గాంధీజీ స్వచ్ఛతకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. స్వచ్ఛమైన ఆత్మకూరు నిర్మాణానికి ప్రజలు మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది మరియు ప్రజాప్రతినిధులు పాల్గొని మహాత్మా గాంధీజీకి ఘనంగా నివాళులర్పించారు.

# పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ ఎదుట ధర్నా

**టి మీడియా , అక్టోబర్ 2 , దమ్మపేట:**

పామాయిల్ దిగుమతి సుంకాల తగ్గింపు ఫలితంగా టన్నుకు 384 తగ్గటాన్ని నిరసిస్తూ శుక్రవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో అప్పారావుపేట ఫ్యాక్టరీ ఎదుట ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మేనేజర్ నాగబాబుకు అందజేశారు.ఈ సందర్భంగా దొడ్డాలక్ష్మీనారాయణ మాట్లాడుతూ పాలకులు అవలంబిస్తున్న వ్యవసాయ వ్యతిరేక విధానాల ఫలితంగా అనేక రకాల పంటలకు గిట్టుబాటు ధర లేని పక్షంలో దమ్మపేట, అశ్వరావుపేట మండలాల్లో గత 40 సంవత్సరాల నుండి సామాన్య రైతు నుండి పెద్ద రైతుల వరకు పామాయిల్ పంట ను నమ్ముకుని సాగు చేస్తున్నారని అన్నారు.మోడీ అవలంబిస్తున్న తిరోగమన వ్యవసాయ విధానాల వలన నేడు పామాయిల్ సాగు ప్రమాదంలో పడిందని, ట్రంపు చెప్పినట్లు మోడీ మనదేశంలో వ్యవసాయ రంగంలో దిగుమతి సుంకాలు పూర్తిగా ఎత్తివేయడానికి నిర్ణయించుకున్నారని, ఫలితంగా పామాయిల్ రేటు పతనావస్థలో ఉన్నదని అన్నారు.భారతీయ వ్యవసాయాన్ని విదేశీ, స్వదేశీ



కార్పొరేట్ రాబందులకు ఆహారంగా వేయడానికి నరేంద్ర మోడీ కంకణం కట్టుకున్నారని దుయ్యబట్టారు. పామాయిల్ రంగాన్ని రక్షించడం కోసం రైతులంతా ఐక్యంగా ఉద్యమించటమే మార్గమని, పామాయిల్ టన్నుకు 25 వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్, మండల కన్వీనర్ మురహరి రఘు, రామకృష్ణ, బాబురావు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ అడుగున రిటైనింగ్ వాల్

**టి మీడియా , అక్టోబర్ 2 మహబూబాబాద్:**

కాకతీయుల కాలం నాటి చారిత్రక శివ కోటేశ్వరాలయానికి పునర్వైభవం తీసుకొచ్చేందుకు చేపట్టిన పునరుద్ధరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మహబూబాబాద్ జిల్లా కాట్రపల్లి గ్రామంలోని ఈ పురాతన ఆలయం కొంతకాలంగా శిథిలావస్థకు చేరడంతో పునరుద్ధరణ పనులు చేపట్టారు.ఆలయ పునరుద్ధరణ కోసం రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి రూ.4.50 కోట్ల నిధులు మంజూరు చేయించారు. అనంతరం ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పునరుద్ధరణలో భాగంగా పాత నిర్మాణాన్ని తొలగించి, ప్రణాళికాబద్ధంగా కొత్త నిర్మాణ పనులు చేపడుతున్నారు.ప్రస్తుతం ఆలయ అడుగు భాగంలో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఈ పనులు పూర్తయిన అనంతరం ప్రత్యేక కాంక్రీట్ నిర్మాణం చేపట్టి, ఆలయానికి సంబంధించిన పాత శిలలను వినియోగిస్తూ నూతన ఆలయ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గుగులోత్ దస్రు నాయక్ తెలిపారు.ఆలయ



పునరుద్ధరణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. పనుల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిరంతరం పర్యవేక్షించేందుకు గ్రామస్తులతో ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాకతీయుల శిల్పకళకు ప్రతీకగా నిలిచిన ఈ ఆలయం పునరుద్ధరణతో మళ్లీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఎమ్మెల్యే చొరవతో పర్దీపూర్ గ్రామానికి బస్సు సౌకర్యం

**ఈ మీడియా, అక్టోబర్ 2 ,దేవరకద్ర:**

దేవరకద్ర నియోజకవర్గం చిన్న చింతకుంట మండలం పర్దీపూర్ గ్రామ ప్రజలు, విద్యార్థుల ప్రయాణ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అధికారులతో మాట్లాడి ప్రతి రోజు మహబూబ్ నగర్ నుండి పర్ది పూర్ మీదుగా ఆత్మకూరు కి బస్సు సౌకర్యం కల్పించేలా చొరవ తీసుకున్నారు. ఈ బస్సు సౌకర్యం అందుబాటులోకి రావడంతో విద్యార్థులు గ్రామస్థుల ప్రయాణ ఇబ్బందులు తగ్గనున్నాయి. ప్రజల అవసరాలను గుర్తించి స్పందించిన ఎమ్మెల్యే చొరవపై పర్దీపూర్ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభిమానం చాటుకున్నారు అలాగే ఎమ్మెల్యే కి ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శివకుమార్,ఉప్ప నర్సింహా రెడ్డి,గ్రామ




అధ్యక్షులు బురనప్ప,మాజి ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మహత్మ గాంధీ జయంతి వేడుకలు

**టీ.మీడియా,అక్టోబర్2,చింతూరు:**

చింతూరు లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా మహత్మగాంధి జయంతి వేడుకలను చరిత్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్.మణి మాల విచ్చేసి విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మహత్మ గాంధీజీ 1869అక్టోబర్ 2వ తేదీన గుజరాత్ రాష్ట్రంలో ఫోర్ బందర్ లోతండ్రి కరంచంద్ గాంధీ తల్లి పుతలీబాయి పుణ్య దంపతులకు జన్మించారన్నారు.మహత్మ గాంధీజీ స్వతంత్రం సాధించడానికి అహింస అనే ఆయుధం తో బ్రిటిష్ వారిని ఈ దేశం నుండి తరలివెళ్లడానికి కృషి చేశారన్నారు. వైస్ ప్రిన్సిపల్ ముల్లి.శేఖర్ మాట్లాడుతూ భారత దేశానికి స్వేచ్ఛ,స్వాతంత్రం తీసుకురావడానికి సహాయ నిరాకరణ ఉద్యమాన్ని సాగించి మహత్ముడుగా కీర్తించబడ్డారనితెలిపారు. కళాశాల ఇంగ్లీష్ అధ్యాపకులు రాకేష్ రాజ్ మాట్లాడుతూ గాంధీజీ భారతదేశ స్వాతంత్ర్య పోరాటం లో అలుపెరుగనిపోరాటం చేసిన మహా మనిషి,జాతి పిత,మహనీయుడనీ తెలిపారు. చరిత్ర అధ్యాపకుడు బి. శ్రీనివాసరావు మాట్లాడుతూ గాంధీజీ 1893 లో దక్షిణాఫ్రికా




లో నల్లజాతీయులు భారతీయుల పట్ల అనుసరిస్తున్న వివక్షతను అహింసపోరాటం ద్వారా విజయం సాదించి1915 భారత దేశంలో అహింస పద్ధతిలో స్వాతంత్ర్య పోరాటం ప్రారంభించి 1947 ఆగష్టు 15 స్వాతంత్ర్యం సిద్ధించే వరకు పోరాడిన [illegible] తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# సంక్షేమ హాస్టళ్లలో భద్రత.. పర్యవేక్షణ ఎక్కడ?



కూలడానికి సిద్ధం గా ఉన్న ముస్తఫా నగర్ గిరిజన హాస్టల్


కనీస భద్రత లేకుండా నిత్యావసరాలు సరఫరా

**⏭|వార్డెన్ నుంచి సిబ్బంది వరకు విధుల్లో నిర్లక్ష్యం**

**⏭| రాత్రివేళ విద్యార్థుల చేతికి గేట్ల తాళాలు!**

**టి మీడియా, అక్టోబర్ 3,ఖమ్మం బ్యూరో:**
ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచిన వివరాల ప్రకారం సంక్షేమ హాస్టళ్లు మొత్తం 104 ఉన్నాయి. జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల భద్రత, సిబ్బంది విధుల నిర్వహణ, నిత్యావసర సరుకుల సరఫరా, అధికారుల పర్యవేక్షణపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. హాస్టళ్ల నిర్వహణలో కొన్ని చోట్ల నిబంధనలు పాటించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ఆరోపిస్తున్నారు.
టీ మీడియా గురువారం నిర్వహించిన క్షేత్రస్థాయి పరిశీలనలో కొన్ని హాస్టళ్ల నిర్వహణపై అనేక అనుమానాలు వ్యక్తమయ్యే పరిస్థితులు కనిపించాయి. వీటికి సంబంధించిన ఫోటోలు, వివరాలు టీ మీడియా వద్ద ఉన్నాయి.
రాత్రివేళ గేట్ల తాళాలు విద్యార్థుల చేతుల్లోకి?
ఖమ్మం నగరంలోని బిల్లా రోడ్డులో ప్రైవేట్ భవనంలో కొనసాగుతున్న బాలికల హాస్టల్ వద్ద గురువారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో తాళం వేసిన అనంతరం తాళం చెవిని విద్యార్థుల వద్ద ఉంచి వాచ్‌మెన్ అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు టీ మీడియా పరిశీలనలో కనిపించింది.
వాచ్‌మెన్ అప్పటికే తన కోసం వచ్చిన ఆటోలో వెళ్లిపోయినట్లు సమాచారం.
రాత్రివేళ బాలికల హాస్టల్ గేటు తాళం బాధ్యత విద్యార్థుల చేతుల్లో ఉండటం భద్రతాపరంగా ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఇది ఒక్కరోజు జరిగిన సంఘటనా? లేక తరచూ ఇలాగే జరుగుతోందా? అనే విషయంపై శాఖ ఉన్నతాధికారులు విచారణ చేయాల్సిన అవసరం ఉంది.
వార్డెన్, పర్మినెంట్ సిబ్బంది విధులకు వస్తున్నారా?
కొన్ని హాస్టళ్లలో వార్డెన్‌తో పాటు పర్మినెంట్ సిబ్బంది విధులకు క్రమం తప్పకుండా హాజరవుతున్నారా? లేక విజిటింగ్ హాజరుతోనే సరిపెడుతున్నారా? అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
కొన్ని చోట్ల అసలు విధుల్లో ఉండాల్సిన సిబ్బంది స్థానంలో బినామీలు విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు కూడా స్థానికుల నుంచి వస్తున్నాయి.
ఈ ఆరోపణలు నిజమైతే, విద్యార్థుల భద్రతతో పాటు ప్రభుత్వ నిధులతో నడిచే సంక్షేమ హాస్టళ్ల నిర్వహణపై తీవ్ర ప్రశ్నలు తలెత్తే అవకాశం ఉంది.

**సీసీ కెమెరాలు ఎక్కడ?**
విద్యార్థుల భద్రత కోసం హాస్టళ్లలో అవసరమైన భద్రతా ఏర్పాట్లు ఉండాల్సి ఉన్నప్పటికీ, కొన్ని హాస్టళ్లలో సీసీ కెమెరాలు లేకపోవడం లేదా తగిన పర్యవేక్షణ లేకపోవడంపై ప్రశ్నలు వస్తున్నాయి.
హాస్టల్ గేట్లు, ప్రవేశ ద్వారాలు, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, అవి పనిచేస్తున్నాయా లేదా అనే అంశంపై అధికారులు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**స్టాక్ గోడౌన్ నుంచి సరఫరా.. పర్యవేక్షణ ఎవరిది?**
హాస్టళ్లకు స్టాక్ గోడౌన్ నుంచి నిత్యావసర సరుకులు సరఫరా చేసే విధానంపైనా టీ మీడియా పరిశీలనలో పలు ప్రశ్నలు తలెత్తాయి.
అన్ని హాస్టళ్లకు సరుకులు సరఫరా చేసే రవాణా కాంట్రాక్టర్ ఒకరే ఉన్నారని, ఆయనే వివిధ హాస్టళ్లకు సరుకులు తీసుకెళ్తున్నారని సమాచారం.
అయితే సరుకులు హాస్టల్‌కు చేరిన సమయంలో సంబంధిత అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణ ఎంతవరకు ఉంటోంది? సరుకు పరిమాణం, నాణ్యత, బరువు, స్టాక్ రిజిస్టర్‌లో నమోదు తదితర అంశాలను ఎవరు ధృవీకరిస్తున్నారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**డ్రైవర్ వద్ద అనధికార పేపర్?**
ఖమ్మం ముస్తఫానగర్ రోడ్ నంబర్--2లోని గిరిజన బాలుర హాస్టల్‌ను గురువారం టీ మీడియా పరిశీలించింది.
సరుకుల సరఫరా సమయంలో హాస్టల్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందే సరుకులను స్వీకరించి, డ్రైవర్ వద్ద ఉన్న ఒక పేపర్‌పై సంతకం చేసినట్లు టీ మీడియా పరిశీలనలో వెల్లడైంది.
ఆ పేపర్ అధికారిక సరుకు స్వీకరణ పత్రం కాదా? దానిపై ఎవరి అనుమతి ఉంది? సరుకుల స్వీకరణకు బాధ్యత వహించే అధికారి ఎవరు? అనే అంశాలపై సంబంధిత శాఖ వివరణ ఇవ్వాల్సి ఉంది.

**వారానికి ఒకసారి మెడికల్ క్యాంప్.. నిజంగానే జరుగుతున్నాయా?**
హాస్టల్ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించేందుకు వైద్య సేవలు అందించాల్సి ఉన్నప్పటికీ, కొన్ని హాస్టళ్లలో వారానికి ఒకసారి మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు రికార్డుల్లో చూపిస్తున్నా, వాస్తవంగా క్యాంపులు జరుగుతున్నాయా? అనే ప్రశ్నలు తల్లిదండ్రులు, స్థానికుల నుంచి వస్తున్నాయి.
క్యాంపులు నిర్వహించకుండానే నిర్వహించినట్లు రికార్డులు తయారు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.
ఈ నేపథ్యంలో ప్రతి హాస్టల్‌కు సంబంధించిన మెడికల్ క్యాంపుల తేదీలు, హాజరైన వైద్య సిబ్బంది వివరాలు, విద్యార్థులకు చేసిన వైద్య పరీక్షలు, మందుల పంపిణీ వివరాలను అధికారులు బహిర్గతం చేయాల్సిన అవసరం ఉంది.

**తనిఖీలు ఎక్కడ?**
హాస్టళ్లను సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాల్సి ఉన్నప్పటికీ, కొన్ని చోట్ల తనిఖీలు క్షేత్రస్థాయిలో కాకుండా కార్యాలయాలకే పరిమితమవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.
తనిఖీలు జరిగినట్లు రికార్డుల్లో నమోదు చేస్తున్నా, వాస్తవంగా అధికారులు హాస్టళ్లను సందర్శిస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
కలెక్టర్ హెచ్చరికలు చేసినా.. మార్పు లేదా?
హాస్టళ్ల నిర్వహణ, విద్యార్థుల భద్రత, సిబ్బంది విధులు తదితర అంశాలపై జిల్లా స్థాయి సమావేశాల్లో అధికారులకు ఇప్పటికే హెచ్చరికలు చేసినట్లు సమాచారం.
అయినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితుల్లో ఆశించిన మార్పు కనిపించడం లేదని తల్లిదండ్రులు, స్థానికులు చెబుతున్నారు.
హెచ్చరికలు, సమావేశాలు, ఆదేశాలు ఉన్నప్పటికీ వాటి అమలును పర్యవేక్షించాల్సిన బాధ్యత ఎవరిది? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

**కూలేందుకు సిద్ధంగా ముస్తఫానగర్ గిరిజన బాలుర హాస్టల్?**
ఖమ్మం ముస్తఫానగర్‌లోని గిరిజన బాలుర హాస్టల్ భవనం పరిస్థితి కూడా ఆందోళన కలిగిస్తోంది.
భవనం నిర్మాణ పరిస్థితి బలహీనంగా కనిపిస్తోందని, విద్యార్థులు అక్కడే ఉంటున్న నేపథ్యంలో ఎలాంటి ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని స్థానికులు చెబుతున్నారు.
భవనానికి ఇంజినీరింగ్ అధికారులు నిర్మాణ భద్రతా పరిశీలన చేశారా? భవనం సురక్షితమేనని ధృవీకరణ ఉందా? అవసరమైతే ప్రత్యామ్నాయ భవనం ఏర్పాటు చేశారా? అనే వివరాలను అధికారులు వెల్లడించాలి.

**విద్యార్థుల భద్రతకు బాధ్యత ఎవరిది?**
సంక్షేమ హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులు ఎక్కువగా ప్రభుత్వంపై ఆధారపడే కుటుంబాలకు చెందినవారు. వారికి నాణ్యమైన ఆహారం, సురక్షితమైన వసతి, వైద్య సదుపాయాలు, భద్రత కల్పించడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత.
గేట్ల తాళాలు విద్యార్థుల వద్ద ఉంచడం, సిబ్బంది విధుల నిర్వహణపై ఆరోపణలు, సీసీ కెమెరాల కొరత, సరుకుల స్వీకరణలో పర్యవేక్షణపై ప్రశ్నలు, మెడికల్ క్యాంపులపై ఆరోపణలు, బలహీనమైన భవనాలు వంటి అంశాలపై జిల్లా అధికారులు సమగ్ర విచారణ నిర్వహించి వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉంది.

**ఫోటోలు ఉన్నాయి.. ప్రశ్నలకు సమాధానాలు ఎవరిస్తారు?**
టి మీడియా క్షేత్రస్థాయి పరిశీలనలో నమోదు చేసిన అంశాలపై సంబంధిత సంక్షేమ శాఖ అధికారులు, వార్డెన్లు, కాంట్రాక్టర్లు తమ వివరణ ఇవ్వాల్సి ఉంది. వారి వివరణ అందినట్లయితే అదే స్థాయిలో ప్రచురించేందుకు టి మీడియా సిద్ధంగా ఉంది.

# మొక్కలు నాటిన సీఆర్‌పీఎఫ్, పోలీస్ అధికారులు

**టీ.మీడియా,అక్టోబర్2 ,చింతూరు:**
జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని చింతూరులో సీఆర్‌పీఎఫ్ డీ/42వ బెటాలియన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సంతోష్ కుమార్ సింగ్, ఇన్‌స్పెక్టర్ సి. అన్బుచెజియన్, చింతూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ, ఎస్‌హెచ్‌ఓ సంతోష్ కుమార్, సీఆర్‌పీఎఫ్ జవాన్లు పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా అధికారులు పర్యావరణ పరిరక్షణ, పర్యావరణ సమతుల్యతను కాపాడటం, గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించడం, కాలుష్య నియంత్రణలో చెట్ల ప్రాముఖ్యతను వివరించారు. చెట్లు వాతావరణాన్ని శుద్ధి చేయడంతో పాటు ఆక్సిజన్‌ను అందించి జీవజాల మనుగడకు దోహదపడతాయని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడాన్ని తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.



పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడం, చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

## గాంధీ చిత్రపటానికి పూలమాల వేసిన చైర్ పర్సన్ సంధ్యారాణి




**టీ మీడియా, అక్టోబర్ 02, రామకృష్ణాపూర్;**
క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లో శుక్రవారం మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని క్యాతనపల్లి పురపాలక సంఘ కార్యాలయంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.గాంధీ చిత్రపటానికి చైర్ పర్సన్ గొడిశెల సంధ్యారాణి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# చింతూరులో కోర్ట్ ఏర్పాటు చేయాలి

**టీమీడియా,అక్టోబర్2,చింతూరు:**
విలీన మండలాల న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం చింతూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో తీర్మానించడం జరిగింది. ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు, పర్మనెంట్ మొబైల్ కోర్టు ఏర్పాటు కోసం విలీన మండలాల్లో అన్ని రాజకీయ పక్షాల తో, ఆదివాసి సంఘాలతో కూర్చొని మాట్లాడుకుని అని రాజకీయ పక్షాల వాళ్లను ఆదివాసి సంఘాలను భాగస్వాములుగా చేసి కోర్టు సాధించాలని తీర్మానించారు . దీనిలో భాగంగా శనివారం నాడు వి ఆర్ . పురం,కూనవరం మండలాలలో వివిధ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసారు ఆదివారం ఎటపాక చింతూరు మండలంలో వివిధ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేయటం ఆ సమావేశం రాజకీయ పక్షాల అభిప్రాయం తీసుకోవటం ఆ అభిప్రాయాలు అన్నిటిని క్రోడీకరిస్తూ సంబంధిత అధికారులు,జిల్లా జెంట్స్ హైకోర్టు ప్యానల్ జెంట్స్ ఆంధ్రప్రదేశ్ న్యాయ శాఖ మినిస్టర్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు వారి నారా చంద్రబాబునాయుడు కు వినతులు ఇవ్వాలని నిర్ణయించడం జరిగింది . ఈ కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్



ప్రెసిడెంట్ కొడాలి శ్రీనివాస్ రావు, పాల్గొని విలీన మండలాల న్యాయవాదుల సంఘానికి మద్దతు తెలుపుతూ పోరాటానికి నా పూర్తి సహకారం ఉంటుందని తెలియజేయడం జరిగిందన్నారు . అలానే రంపచోడవరం బార్ అసోసియేషన్ యొక్క సహకారం కూడా తీసుకొని ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లాలని కోరడం జరిగింది . రంపచోడవరం సీనియర్ న్యాయవాది సుక్క సంతోష్ కుమార్ పాల్గొన్నారు .ఈ కార్యక్రమంలో విలీన మండలాల న్యాయవాదుల సంఘం కన్వీనర్: ఇల్లా చిన్నారెడ్డి కో- కన్వీనర్లు ధర్మల లక్ష్మీనారాయణ,ఈసంపల్లి శ్రీనివాసరావు,సీనియర్ నాయకులు ఆవులూరి సత్యనారాయణ, పి నాగరాజ్ మోసం సంజీవరావు,మడివి రవితేజ, సోయం దుర్గ కామేష్, కే. రాంబాబు మల్లికార్జునరావు ప్రతాప్ ప్రవీణ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## సగర సంఘం నాయకుడి మృతి



**టీ మీడియా, అక్టోబర్ 2, పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన సగర (ఉప్పర) సంఘం అధ్యక్షులు కురుకుంట్ల బాలస్వామి హఠాత్తుగా మరణించడం పట్ల సంఘం నాయకులు గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు ఈ దుర్వార్త తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర సాగర సంఘం అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సాగర రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీను సగర అందరూ అయ్యవారిపల్లికి చేరుకున్నారు అయ్యవారిపల్లి గ్రామ సర్పంచ్ ఆస్కని కురుమూర్తి సాగర్ సగర సంఘం ఉపాధ్యక్షులు ఆస్కని ఆంజనేయులు అలాగే సాగర సంఘం సభ్యులు అందరూ మరణించిన బాలస్వామి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ గాఢ సానుభూతిని తెలియజేశారు బాలస్వామి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబానికి ఈ కష్టాన్ని తట్టుకునే ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు సంఘం కోసం వారు చేసిన సేవలను గుర్తుచేశారు

# శీనన్న ఆత్మీయ భరోసా



**టీ మీడియా, అక్టోబర్ 2, కూసుమంచి:**
ఆపదలో ఉన్న కుటుంబాలకు తానున్నానంటూ, రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆత్మీయ భరోసా కల్పిస్తూ అండగా నిలుస్తున్నారు. ఆయా కుటుంబాలకు
పి ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. కూసుమంచి మండలంలోని పలు గ్రామాలలో వివిధ కారణాలతో ఇటీవల కుటుంబ సభ్యులను కోల్పోయి విషాదంలో ఉన్న 43 పేద కుటుంబాలకు ట్రస్టు ద్వారా ఒక్కో కుటుంబానికి 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. స్వయంగా గృహాలకు వెళ్లి మృతుల చిత్రపటాలకు పూలమాలవేసి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపి, భరోసా కల్పించారు. మండలంలోని జీళ్ళచెరువు, నేలపట్ల, కోక్య తండ,లోక్య తండ, గట్టుసింగారం, మల్లేపల్లి, జక్కపల్లి ఎస్సీ కాలనీ, రాజుపేట, రాజపేట బజార్, మంగళ్ తండా, నాయకన్ గూడెం, పాలేరు, జజ్జులరావుపేట, గురువాయుగూడెం, నరసింహుల గూడెం, సంధ్య తండా, పోచారం, ముత్యాల గూడెం, చేగొమ్మ, ధర్మ తండా, కూసుమంచి, తదితర గ్రామాలలో పర్యటించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు.
ఈ కార్యక్రమంలో కూసుమంచి క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డి, జిల్లా నాయకులు జొన్నలగడ్డ రవి కుమార్, మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు, మండల నాయకులు బొల్లంపల్లి సుధాకర్ రెడ్డి, చాట్ల పరశురాం, ఇంటూరి పుల్లయ్య, మాదాసు ఉపేందర్ రావు, బారి వీరభద్రం , బానోత్ సత్యం, సర్పంచ్ లు వడిత్య వెంకటేష్ నాయక్, బాదావత్ నరేష్, బానోతు నాగేశ్వరావు, పాలేరు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వట్టి శ్రీనివాసరెడ్డి, నాయకులు ఎడవెల్లి ఉపేందర్ రెడ్డి కొత్త పుల్లారెడ్డి , బత్తుల ఉప్పయ్య, గోపి వీరస్వామి, కార్తీక్ , యువజన విభాగం శేఖర్ రెడ్డి, జర్పుల రవి, వడిత్య సురేష్ నాయక్,రమేష్ , ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రూ. 2,000 దాటితే నో యూపీఐ..

**● నగదు లేదా క్రెడిట్ కార్డు చెల్లింపులకే ప్రాధాన్యం!**

**టి మీడియా , అక్టోబర్ 2 , ఢిల్లీ బ్యూరో :**
వ్యాపారులకు ఉచిత చెల్లింపు విధానంగా గత ఆరేండ్లుగా కొనసాగుతున్న యూపీఐ అక్టోబర్ 15 నుంచి పరీక్షను ఎదుర్కోనున్నది. వ్యక్తి నుంచి వ్యాపారికి జరిగే రూ.2,000 కంటే ఎక్కువ విలువైన చెల్లింపులపై 0.4% మర్చంట్ డిస్కౌంట్ రేట్(ఎండీఆర్) అమల్లోకి రానున్నది. వ్యాపారులు ఈ భారాన్ని వినియోగదారులపై మోపితే ఈ మార్పు వల్ల అధిక సంఖ్యలో వినియోగదారులు నగదు, క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులు, బ్యాంకు బదిలీల వైపు మొగ్గు చూపే అవకాశం ఉందని లోకల్ సర్కిల్స్ జరిపిన తాజా సర్వేలో వెల్లడైంది. సర్వేలో పాల్గొన్న వినియోగదారుల్లో కేవలం 14శాతం మంది మాత్రమే రూ.2,000 కంటే అధిక మొత్తానికి చేసే చెల్లింపులపై వ్యాపారి అదనపు రుసుము వసూలు చేస్తే ఆ ఆదనపు ఖర్చును భరిస్తూనే యూపీఐ ద్వారా చెల్లింపులు కొనసాగిస్తామని చెప్పారు. మిగిలిన వారు వేరే చెల్లింపు విధానాన్ని ఎంచుకుంటామని లేదా కొనుగోలును విరమించుకుంటామని లేదా వాయిదా వేస్తామని తెలిపారు. లోకల్ సర్కిల్స్ నిర్వహించిన ఈ సర్వేలో 291 జిల్లాలకు చెందిన యూపీఐ వినియోగదారుల నుంచి 67,000కు పైగా స్పందనలు వచ్చాయి.
ఒకవేళ వ్యాపారి అదనపు రుసుము వసూలు చేస్తే వినియోగదారులు ఏమి చేస్తారన్న నిర్దిష్ట ప్రశ్నకు సంబంధించి 11,206 స్పందనలు నమోదయ్యాయి. వీరిలో అత్యధికులు(27 శాతం)




తాము నగదు రూపంలో చెల్లిస్తామని చెప్పారు. మరో 26 శాతం మంది క్రెడిట్ కార్డుకు మారుతామని చెప్పగా, 4 శాతం మంది డెబిట్ కార్డును ఉపయోగిస్తామని తెలిపారు. మరో 4 శాతం మంది బ్యాంక్ బదిలీలు, నెఫ్ట్ లేదా ఐఎంపీఎస్ పద్ధతులను ఉపయోగిస్తామని, 9 శాతం మంది అదనపు రుసుము లేని మరో చెల్లింపు విధానం గురించి వ్యాపారిని అడుగుతామని చెప్పారు.
కేవలం 14 శాతం మాత్రమే యూపీఐని ఉపయోగించడాన్ని కొనసాగిస్తూ ఆ మొత్తాన్ని భరిస్తామని చెప్పారు. మరో 2 శాతం మంది కొనుగోలును వాయిదా వేస్తామని లేదా మానుకుంటామని చెప్పగా 4 శాతం మంది దీనిపై ఏమీ చెప్పలేకపోయారు. సర్వేలో పాల్గొన్న వారిలో దాదాపు ఏడుగురిలో ఒకరు మాత్రమే ఆ అదనపు ఖర్చును తామే భరించి యూపీఐని కొనసాగిస్తామని చెప్పారు.
వ్యాపారుల ఆందోళన
ఈ కొత్త ఖర్చును భరించడానికి వెనుకాడుతున్నది వినియోగదారులు మాత్రమే కాదు. 242 జిల్లాల్లోని 32,000కు పైగా వ్యాపార సంస్థలపై లోకల్ సర్కిల్స్ నిర్వహించిన ఒక ప్రత్యేక సర్వేలో రూ.2,000 కంటే ఎక్కువ విలువైన యూపీఐ చెల్లింపులపై 0.4 శాతం ఎండీఆర్ భరించడానికి కేవలం 17 శాతం మంది వ్యాపారులు మాత్రమే సుముఖత వ్యక్తం చేశారు. 41 శాతం మంది తాము ఎటువంటి ఎండీఆర్ భరించబోమని చెప్పగా మరో 9 శాతం మంది తాము యూపీఐని అస్సలు అంగీకరించడం లేదని తెలిపారు.

# రైల్వే స్టేషన్లలో నీరు తాగొచ్చా?

**● తనిఖీల్లో బయటపడ్డ నిజాలు ఇవే!**

**టి మీడియా , అక్టోబర్ 2 , అమరావతి బ్యూరో :**
రైలు ప్రయాణం అంటేనే ఒక వింత అనుభూతి. దూర ప్రయాణాలు చేసేవారు ఎక్కువగా రైళ్లనే ఎంచుకుంటారు. అయితే, రైళ్లలో ఇలా దూర ప్రయాణాలు చేసేవారికి ఒక ప్రధాన సమస్య ఎదురవుతుంది... అదే దాహం! ప్లాట్‌ఫారమ్ మీద లభించే వాటర్ బాటిళ్లు ప్రతీసారి కొనుక్కోవడం అందరికీ వీలుపడదు. అందుకే చాలామంది స్టేషన్లలో ఉండే వాటర్ ట్యాప్‌ల దగ్గరికే వెళ్లి తమ బాటిళ్లను నింపుకుంటారు. అయితే, అలా నీళ్లు తాగే సమయంలో చాలామందికి ఒక దేహం కలుగుతుంది... "ఈ నీళ్లు అసలు తాగొచ్చా? ఈ నీరు స్వచ్ఛమైనదేనా? లేక ఏమైనా బ్యాక్టీరియా ఉండి మన ఆరోగ్యం పాడవుతుందా?" అని.. ఈ సందేహాలకు స్వయంగా రైల్వే అధికారులే సమాధానం చెప్పారు. విజయవాడ రైల్వే డివిజన్ నిర్వహించిన భారీ తనిఖీల నివేదిక ఇప్పుడు అందరికీ ఊరటనిస్తోంది. విజయవాడ డివిజన్ పరిధిలోని రైల్వే స్టేషన్లు, సమీప ప్రాంగణాల్లో అధికారులు ఇటీవల విస్తృతంగా నీటి నాణ్యతా పరీక్షలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ప్రధానంగా రెండు కీలక అంశాలపై దృష్టి పెట్టారు. మొదటిది... బ్యాక్టీరియా పరీక్షలు: డివిజన్ పరిధిలోని 99 రైల్వే స్టేషన్ల నుంచి ఏకంగా 633 నీటి శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌లలో పరిశీలించారు. ఆశ్చర్యకరంగా, ఈ 633 శాంపిల్స్‌లో ఒక్కటంటే ఒక్క శాంపిల్‌లో కూడా హానికరమైన బ్యాక్టీరియా ఉన్నట్లు తేలలేదు! నీరు తాగడానికి పూర్తిగా



అనుకూలంగా ఉందని నివేదిక స్పష్టం చేసింది. రెండోది... క్లోరినేషన్ స్థాయిలు: నీటిలోని క్రిములను సంహరించి, నీటిని స్వచ్ఛంగా ఉంచడానికి క్లోరిన్ ఉపయోగిస్తారు. 83 స్టేషన్లలో ఏకంగా 9,571 సార్లు క్లోరిన్ స్థాయిలను పరీక్షించారు. ఇందులో 9,565 సార్లు నీరు నిర్దేశిత ప్రమాణాల ప్రకారమే ఉందని తేలింది. అంటే క్లోరిన్ పరీక్షల్లో 99.93 శాతం ఉత్తీర్ణత సాధించారు! "ఇదేంటి... వేల సంఖ్యలో పరీక్షలు చేస్తే ఒక్కచోట కూడా లోపం లేదా? ఇదంతా నమ్మశక్యంగా ఉందా?" అని మీకు అనిపిస్తోంది కదా? మీ అనుమానం నిజమే! అధికారులు జరిపిన తనిఖీల్లో ఆరు ప్రదేశాల్లో క్లోరిన్ స్థాయిలలో స్వల్ప తేడాలు, సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. అయితే అధికారులు ఆ విషయాన్ని దాచకుండా, వెంటనే స్పందించి సంబంధిత విభాగాల ద్వారా ఆ లోపాలను సరిదిద్దే చర్యలు చేపట్టారు. ముఖ్యంగా నిత్యం వేలాదిమంది వచ్చే విజయవాడ ప్రధాన స్టేషన్‌లో 127 బ్యాక్టీరియా, 1,249 క్లోరిన్ పరీక్షలు చేశారు. భీమవరం సెక్షన్, అలాగే అత్యధికంగా పరీక్షలు జరిగిన తెనాలి డిపోలోనూ నీటి నాణ్యత అత్యుత్తమ ప్రమాణాలకు అనుగుణంగా ఉందని ధ్రువీకరించారు. ఇక అధికారులు తీసుకుంటున్న జాగ్రత్తలు , ప్రయోజనాలు విషయానికి వస్తే.. కేవలం ఒకసారి పరీక్షలు చేసి ఊరుకోవడం లేదు. రోజువారీగా ప్రయాణికులు వాడే ఈ నీటి నాణ్యతపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. స్టేషన్లలో లభించే నీరు సురక్షితంగా ఉండటం వల్ల ప్రయాణికులకు రెండు రకాల ప్రయోజనాలు ఉన్నాయి. ఒకటి...ఆరోగ్య భద్రత: కలుషిత నీటి వల్ల వచ్చే టైఫాయిడ్, కలరా, డయేరియా వంటి నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల భయం ఉండదు. రెండోది..ఆర్థిక ఊరట: ప్రతీ స్టేషన్‌లో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు కొనే అవసరం తగ్గి, సామాన్య ప్రయాణికుడికి డబ్బు ఆదా అవుతుంది. మొత్తానికి విజయవాడ డివిజన్ గణాంకాలను పరిశీలిస్తే.. ప్రస్తుతం మన రైల్వే స్టేషన్లలో లభించే నీరు ప్రయాణికులు తాగడానికి పూర్తిగా సురక్షితమైనదేనని స్పష్టమవుతోంది. కాబట్టి, ఇకపై విజయవాడ డివిజన్ పరిధిలో ప్రయాణించేటప్పుడు కలుషిత నీటి భయాలు పక్కనపెట్టి నిశ్చింతగా దాహం తీర్చుకోవచ్చు!

# తెలంగాణను వణికిస్తున్న వైరల్ ఫీవర్లు



**● పెరుగుతున్న డెంగీ కేసులు**

**టి మీడియా , అక్టోబర్ 2 , హైదరాబాద్ :**
రాష్ట్రవ్యాప్తంగా డెంగీ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, ములుగు వంటి ఏజెన్సీ ప్రాంతాల్లోనూ పెద్ద సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి. ఇప్పటికే ఇద్దరు వ్యక్తులు డెంగీ కారణంగా మరణించడం మరింత ఆందోళన కలిగిస్తోంది. వైరల్? ఫీవర్ల దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, జ్వరం వస్తే సరైన వైద్య చికిత్స పొందాలని వైద్యులు సూచిస్తున్నారు.
5 లక్షలకు పైగా కేసులు
ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభంలో అధికారులు జ్వర సర్వేను చేపట్టారు. ఇప్పటివరకు 5 లక్షల మందికి పైగా జ్వరంతో బాధపడినట్లు గుర్తించారు. వీరిలో సుమారు 3,000 డెంగీ కేసులు బయటపడటం ఆందోళనకరమైన విషయం. సుమారు 5,000 టైఫాయిడ్ కేసులు నమోదైనప్పటికీ, మరణాలు సంభవించకపోవడం ఊరటనిచ్చే అంశం. తక్కువ సంఖ్యలో మలేరియా కేసులు కూడా నమోదయ్యాయి. గాంధీ ఆసుపత్రిలో చేరే రోగులలో 20 శాతం వరకు జ్వర బాధితులే ఉంటున్నారు. వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రి జ్వర బాధితులతో కిక్కిరిసిపోతోంది. హైదరాబాద్‌లోని ఫీవర్ ఆసుపత్రిలో, జ్వర బాధితుల రోజువారీ అవుట్‌పేషెంట్ సంఖ్య సెప్టెంబర్ మూడవ వారంలో సుమారు 400 ఉండగా, నెలాఖరు నాటికి 600 దాటడం తీవ్రతను తెలియజేస్తోంది.
డెంగీ జ్వరాన్ని నివారించడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. దోమ కాటుకు గురికాకుండా చూసుకోవాలి. ప్రతి శుక్రవారం 'డ్రై డే' పాటించాలి. నిల్వ ఉన్న నీటిలోనే డెంగీకు కారణమయ్యే దోమల లార్వాలు వృద్ధి చెందుతాయి. అందువల్ల నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త వహించాలి. డెంగీ లక్షణాలలో తీవ్రమైన ఒళ్లు నొప్పులు, దగ్గు, జ్వరం, తలనొప్పి, నల్లని రంగులో మలం పడటం వంటివి ఉంటాయి. అప్రమత్తంగా ఉండి, చికిత్స కోసం వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. శరీరంపై దద్దుర్లు లేదా అంతర్గత రక్తస్రావం ప్రమాదకరమైన సంకేతాలు. కాచి వడపోసిన నీటిని తాగాలి. పోషకాహారం తీసుకోవాలి – డాక్టర్ మూసాఖాన్, సూపరింటెండెంట్, ఫీవర్ హాస్పిటల్, హైదరాబాద్?
సెప్టెంబర్‌లో వేలకు చేరిన డెంగీ కేసులు
ఆగస్టు వరకు వందల సంఖ్యలో మాత్రమే ఉన్న డెంగీ కేసులు సెప్టెంబర్‌లో వేల సంఖ్యకు చేరడం, అలాగే రెండు మరణాలు సంభవించడం ఆందోళన కలిగిస్తోంది. డెంగీ లక్షణాలు ఉన్న రోగులలో ప్లేట్‌లెట్ల సంఖ్య ప్రారంభంలో సుమారు 1,20,000 ఉన్నప్పటికీ కేవలం నాలుగు రోజుల్లోనే 20,000 నుంచి 30,000 స్థాయికి పడిపోతోందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఒక్క జలాశయమూ పూర్తిగా నిండలేదు




**● ఈసారి తాగునీటికి ట్యాంకర్లూ సరిపోయేలా లేవు!**

**టి మీడియా , అక్టోబర్ 2 , హైదరాబాద్ బ్యూరో :**
ఈసారి ఒక్క జలాశయం కూడా పూర్తిగా నిండలేదు. చెరువులూ పెద్దగా అలుగులు పారింది లేదు. వాగుల పరిస్థితి చెప్పే అవసరమే లేదు. ఫలితంగా వానాకాలంలోనే రాష్ట్ర భూగర్భం జలం అంతకంతకూ ఖాళీ అవుతోంది. గతేడాదితో పోల్చితే సెప్టెంబర్ నెల రాష్ట్ర జలమట్టం సగటున 3.11 మీటర్ల కిందకు పడిపోయింది.
2025 సెప్టెంబర్?లో 4.41 మీటర్ల వద్ద ఉన్న భూగర్భ జలమట్టం ఈ సెప్టెంబర్?లో 7.52 మీటర్ల లోతుకు పడిపోయి తాగునీటికి ప్రమాద సూచికలు చేస్తోంది. ఈ మేరకు రాష్ట్ర భూగర్భ జల వనరుల శాఖ డైరెక్టర్ కె.లక్ష్మి నీటికి సంబంధించిన నివేదికను విడుదల చేశారు. వాటిలోని వివరాలు ఇలా ఉన్నాయి.
ప్రమాద హెచ్చరికలు
ఏటా మే నెల వచ్చే సరికి భూగర్భ జలమట్టం పడిపోవడం సాధారణమే. వేసవి కాలం కారణంగా నీటి వినియోగం అధికంగా ఉండటమే ఇందుకు కారణం. ఈ ఏడాది మేలో రాష్ట్ర సగటు భూగర్భ జలమట్టం 7.87 మీటర్లుగా నమోదైంది. నైరుతి రుతుపవన సీజన్‌లో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కురిసే వర్షాలతో నేలలోకి నీళ్లు ఇంకి భూమి రీఛార్జ్ కావాలి. కానీ ఎల్?నినో కారణంగా వానలు లేకపోవడంతో భూగర్భం ఖాళీ అయింది.
ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో నీటి ఆవిరి కూడా ఎక్కువగా ఉంది. ఇకపై పెద్దగా వర్షాలేవీ ఉండవని వాతావరణ శాఖ వెల్లడించింది. అంటే నేలలోకి ఇంకే నీటి శాతం చాలా తక్కువగా ఉంటుందన్న మాట. ఈ కారణంగా అక్టోబర్ నుంచి 2027 మే నెలాఖరు వరకు తాగు నీటికి కూడా సమస్య ఉంటుందని జల వనరుల శాఖ అధికార వర్గాలు సూచిస్తున్నాయి.
రాజధానిపై తీవ్ర ప్రభావం
హైదరాబాద్ జిల్లాలో భూగర్భ జలమట్టం అత్యధికంగా పడిపోవడం ఆందోళనకు గురి చేస్తోంది. 2025 సెప్టెంబర్?లో ఈ జిల్లా సగటు 3.57 మీటర్లు ఉండగా, ఈ ఏడాది సెప్టెంబరులో ఏకంగా 6.44 మీటర్లు పడిపోయి 10.01 మీటర్లుగా నమోదవడం కొంతమేర కలవరమే. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 5.35 మీటర్ల సగటుకు గానూ 6.29 మీటర్ల మేర పడిపోయి 11.64 మీటర్లకు చేరింది. వికారాబాద్ జిల్లాలో 5.79 మీటర్ల నుంచి 11.96 మీటర్లకు భూగర్భ జలాలు పడిపోయాయి. అంటే 6.17 మీటర్ల లోతుకు దిగజారింది. ఇక రంగారెడ్డి జిల్లాలో 6.31 మీటర్ల నుంచి 11.74 మీటర్లకు, మహబూబ్‌నగర్ జిల్లాలో 5.27 మీటర్ల నుంచి 10.51కి, సంగారెడ్డి జిల్లాలో 6.08 నుంచి 11.21 మీటర్ల లోతుకు చేరింది.
పెద్దపల్లి, మంచిర్యాలలో కాస్త మెరుగు
రాష్ట్రంలో ఎల్?నినో ప్రభావం ఉన్నప్పటికీ అతి తక్కువగా పెద్దపల్లి జిల్లాలో సగటు భూగర్భ జలమట్టం 1.02 మీటర్లు మాత్రమే తగ్గడం విశేషం. గత సెప్టెంబర్?లో ఈ జిల్లాలో 3.52 మీటర్లు కాగా, ఈ ఏడాది సెప్టెంబరులో 4.54 మీటర్లుగా రికార్డైంది. మంచిర్యాల జిల్లాలో 1.05 మీటర్లు, కుమురం భీం ఆసిఫాబాద్‌లో 1.18 మీటర్లు, జగిత్యాల జిల్లాలో సగటున 1.32 మీటర్లకు భూగర్భ జలాలు పడిపోయాయి.
ఈ 19 జిల్లాలు మేల్కోవాల్సిందే!
ఎల్‌నినో ప్రభావంతో ఈసారి రుతు పవనాలు ఆలస్యమవడంతో జూన్, జులైలలో రైతులు, గృహ వినియోగదారులు బోర్లపై అధికంగా ఆధారపడ్డారు. రాష్ట్ర సగటు లోటు వర్షపాతం 18 శాతం నమోదవగా, 19 జిల్లాల్లో తీవ్ర లోటును రాష్ట్రం ఎదుర్కొంది. నల్గొండ, నిర్మల్, హనుమకొండ, జనగామ, జోగులాంబ గద్వాల, మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, హైదరాబాద్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, వికారాబాద్, వనపర్తి, వరంగల్, యాదాద్రి భువనగిరి, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో తీవ్రమైన వర్షపాత లోటు ప్రభావంతో భూగర్భ జలాలు అధికంగా అడుగంటడం ఆందోళనకర విషయమే.